# ప్రారబ్ధం శిలాతలం

## _భానుమతీ రామకృష్ణ

**జీ**వితంలో ప్రతి వ్యక్తీ అన్నీ వున్నా ఏదో కొరతతో బాధ పడుతూంటాడు. కొందరు సకల సౌభాగ్యాలున్నా కీర్తి దాహంతో బాధపడుతూంటారు. కొందరు కీర్తీ, డబ్బూ అన్నీ సమకూరినా సంసార జీవితంలో మనశ్శాంతి లేక బాధపడుతూంటారు... మొత్తానికి నేను సుఖంగా వున్నాను అని తృప్తితో చెప్పేవాళ్ళు అరుదు!

ఈ విషయంగా నలభై ఏళ్ళ క్రితం కీర్తిశేషులు శ్రీ ఎన్.ఎస్. కృష్ణన్‌గారు "నల్లతంబి" అనే పిక్చర్ షూటింగ్ విరామ సమయంలో ఒక జోక్ చెప్పారు – "అమ్మా మీరెవర్నయినా తెలిసినవాళ్ళను 'ఏమండీ బాగున్నారా?' అని అడగండి! 'ఆ! ఏం బాగోలెండి. ఈ రోజు ఇంట్లో బాగాలేదు' అంటారు.

'అలాగా? మీ భార్య బాగున్నారా?'

'ఆ! ఏం భార్యో లెండి! దానికీ ఆరోగ్యం బాగా లేదు. ఆర్థరైటీస్ తో అవస్థపడుతోంది!'

'మరి పిల్లలు?...'

'ఆ ఏం పిల్లలోలెండి! పరీక్షల సమయానికి జ్వరాలూ, జలుబులూ!...'

'అయ్యో పాపం? ఇంతకీ మీ బిజినెస్ ఎలా వుంది?'

'ఆ! ఏం బిజినెసోలెండి! ఒకే నష్టం'...

ఇదీ వరస! ఒక్క ప్రశ్నకయినా సంతోషకరమైన సమాధానం లేదుగదా!..." అంటూ చెప్పి అందర్నీ నవ్వించేడా మహానుభావుడు!

దీనికంతా కారణం తృప్తి లేకపోవడమే! అదే



కొరతలకు కారణం! తృప్తిలేకుండా కొరతలతో బాధ పడుతుండడాన్నే పూర్వప్రారబ్ధం అనాలి. అందరూ అలా తృప్తితో జీవించే శక్తిగలవారైతే కర్మానుభవం అనే దానికి స్థానమే లేదు... పూర్వ కర్మలను అనుభవింపజేసే నవగ్రహాలకు పనే లేదు! కర్మానుభవం అన్నది అతి బలీయమైంది! శివుడంతటివాడే తప్పించుకోలేకపోయాడంటారు పెద్దలు! ముఖ్యంగా అన్ని గవర్నమెంట్స్‌నీ మించింది 'ప్లానిటరీ గవర్నమెంట్'! కింద వుండే వాళ్ళని అందలం ఎక్కించగలవు, అందలాన వుండేవాళ్ళని కిందికి లాగిపారేయగలవు గ్రహాలు!

ఈ విషయంలో శనీశ్వరుడు అతి బలవంతుడు! ఒకనాడు ఈశ్వరుడే శనీశ్వరుడికి భయపడి చెట్టుతొర్రలో పురుగై దాక్కున్నాడంటారు! అది నిజమో కట్టుకథో – మొత్తానికి శని ప్రభావం ఎంత బలవత్తరమైందో అలాంటి కథల వల్ల తెలుస్తుంది! అలాగే నలుడు గూడా శని ప్రభావం వల్ల రాజ్యాన్ని పోగొట్టుకుని కన్నబిడ్డలకు దూరమై అడవులపాలు కావడమే కాకుండా, పక్కన పడుకుని నిద్రపోతున్న భార్య చీర చించి, పీలిక

కట్టుకుని భార్యను ఒంటరిగా అడవిలో వదిలి వెళ్ళాడు. ఊరికే వుండకుండా కట్టుకున్న ఆ చీర పీలికను పక్షుల్ని పట్టుకోడానికి విసిరివేస్తే ఆ పక్షులు మీదబడ్డ చీర పీలికతో సహా ఎగిరిపోవ డంతో అంతటి నలమహారాజే నగ్నంగా నల్లేరు పొదల్లో నానా అవస్థలూ పడ్డాడంటే శని ప్రభావం ఎంత ఘాటయిందో ప్రతివారికీ తెలిసిందే!

ఆ! అదంతా నాన్సెన్స్! గ్రహాలూ లేవూ, గాడి దగుడ్డూ లేదు అనే వారూ ఎక్కువే. అల్లా అనడం గూడా ప్రారబ్ధంలో భాగమే అనుకోవాలి. నలుడి కథలాగే పురూరవుడి కథ గూడా. కాని, పురూరవుడు జ్ఞాని అనే చెప్పాలి. శనీశ్వరుడు తన దగ్గరకొచ్చి నిన్ను పట్టబోతున్నానని ముందే 'అప్పాయింట్‌మెంట్' తీసుకున్నప్పుడు పురూరవుడు అలక్ష్యంతో, అహంకారంతో శని ప్రభావాన్ని చుల కన చేయకుండా తల వంచాడు. తక్షణం పొరుగు దేశపు రాజు పురూరవుడి మీదికి దండెత్తి వస్తున్నట్టు వార్త వచ్చింది. ఎదుర్కోడానికి సన్నా హమవుతున్న సైన్యాన్ని వారించి పురూరవుడు నవ్వుతూ, 'నేను యుద్ధం చేసినా శనీశ్వరుడు నన్ను ఓడిస్తాడు. నా సైన్యం అన్యాయంగా చావడం నేను సహించలేను' అని ప్రకటించాడు. తన రాజ్యం మీదికి దండెత్తి వచ్చే రాజును మర్యా దగా ఆహ్వానించి, తనకు ఏ విధంగా భక్తిశ్రద్ధలతో సేవచేశారో అలాగే ఆ వచ్చే శత్రురాజుకు గూడా సేవలు చేయమని హితబోధ చేసి కట్టుబట్టలతో రాజ్యం విడిచి పోయాడు పురూరవ చక్రవర్తి. ఆ తర్వాత ఇంకా ఎన్నో వింత కష్టాలు శని ప్రభావం వల్ల అనుభవించాడు.

ఎంతమంచి మార్గంలో వెళ్ళినా పూర్వకర్మల్ని తప్పించుకోవడం కష్టం. నేను మంచి బాటలోనే నడుస్తున్నానే ఈ దెబ్బలెలా తగుల్తున్నాయబ్బా – అనుకుని కంగారుపడి మనసు పాడుచేసుకోవడం కంటే ఒక్క క్షణం పురూరవుడి కథ గుర్తుకుతెచ్చు కుంటే ఆత్మబలంతో నవ్వుతూ శనీశ్వరుడు పెట్టే కష్టాలు సులభంగా అనుభవించవచ్చు.

పూర్వప్రారబ్ధాన్ని తప్పించుకోడానికి ప్రయత్నిస్తే అది పదింతలవుతుంది... వడ్డీతో సహా ఎప్పుడో ఒకప్పుడు ఎన్నో రెట్లు అనుభవించక తప్పదు. దీనికి ఒక ఉదాహరణగా ఒక కథ ఒక మహానుభావుడు చెప్పాడు. ఒక ఊళ్ళో ఒక గొప్ప వేదాంతి పరోపకారీ దైవభక్తుడూ వుండేవాడు. ఆ వూళ్ళో ప్రతివాళ్ళూ తమకి ఏ కష్టాలు వచ్చినా ఆయన దగ్గరకు పరు గెత్తుకు వెళ్ళి చెప్పకుని ఆ మహానుభావుడి సలహా ప్రకారం నడుచుకుని సంతోషంగా వుండేవారు. కానీ ఆ మహానుభావుడు పూర్వకర్మ వల్ల చాలా భయంకరమైన ఉబ్బసం వ్యాధితో బాధపడుతూ వుండేవాడు. అలాంటి సమయంలో ఒక బాధి తుడు తన కూతురి కాపురం నిలబెట్టే విషయంలో




ఆ మహానుభావుడి సలహా అర్థించి పరుగెత్తుకు వచ్చాడు. కాని ఆ వచ్చిన బాధితుడు ఈయన ఊపిరాడని ఉబ్బసంతో అవస్థపడడం చూసి తిరిగి వెళ్ళబోతుంటే ఆ మహాత్ముడు అతనిని వెళ్ళవద్దని సైగతో ఆపి పక్కనే వున్న ఒక పూచిక పుల్ల తీసుకుని రెండుగా విరిచి కింద పడేసి, "ఇప్పుడు చెప్పు నాయనా నీ కష్టమేమిటో" అని అన్నాడు. ఆ వచ్చిన బాధితుడు తన కష్టం చెప్పడం మొదలు పెట్టాడు.

కాని అంతవరకూ దగ్గుతో మాట్లాడలేని స్థితిలో వున్న ఆయన ఉబ్బసం ఉన్నట్టుండి ఆగిపోయి మామూలు మనిషిగా అయిపోవడం, ఆయన తుంచి కిందపడవేసిన పుల్ల ఎగురుతూ వుండడం చూసిన ఆ బాధితుడు, "ఇదేవిటి బాబూ! ఆ పుల్ల విరిచి కిందపడవేసిన మరుక్షణం మీ బాధంతా పోయింది. విరిగిన ఆ పుల్ల మాత్రం ఎగు రుతూందే" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు. ఆ మహాత్ముడు నవ్వుతూ, "ఏం లేదు నాయనా! నీ బాధ పోగొట్టడానికి నా బాధ కాసేపు ఆ పుల్లకి బదిలీ చేశాను. నేను నా బాధ ఈ కాసేపూ తప్పించుకున్నందుకు ఇంతకు రెండింతలు మళ్ళీ అనుభవించాలి. కాని మనం చేసే మంచి కార్యాల వల్ల పాపకర్మానుభవాన్ని కొంతలో కొంత తగ్గిం చుకోవడమో లేక సునాయాసంగా అనుభవించే శక్తి పొందడమో చేయవచ్చు. కాని పూర్వకర్మలను పూర్తిగా తుడిచివేయడం ఎవరి వల్లా సాధ్యంకాదు నాయనా" అన్నాడట. ఆ మహానుభావుడు చెప్పింది అక్షరాలా నిజమని ప్రతివారూ ఒప్పుకోక తప్పదు.


రమణమహర్షి అంతటి మహాత్ముడు కర్మాను భవాన్ని తప్పించుకోలేదు. జ్ఞాని గనుక నవ్వుతూ తేలికగా అనుభవించాడు. ఒకసారి ఒక పెద్దమనిషి చెప్పడం విన్నాను – కొందరు కీర్తీ డబ్బూ అన్నీ వచ్చి తమ అంతస్థు పెరగగానే, అదంతా తమ స్వయంకృషివల్లే వచ్చిందనీ, స్వశక్తివల్లే పైకి వచ్చా మనీ, దేవుడూ అదృష్టం ఇత్యాది మీద నమ్మకం లేదనీ చెప్పకునేవారున్నారు. అదివారి తప్పు కాదు. ఈ జన్మలో దేవుడంటే నమ్మకం లేదనే వారు పూర్వజ న్మలో అపార దైవభక్తిగలవారై దరిద్రం అనుభవిస్తూ కూడా ఎంతో పుణ్యం కూడబెట్టుకుని అదంతా పూర్వకర్మ అని బ్యాంకులో వేసుకుని పుట్టారు. ఈ జన్మలో ఆ పుణ్యం అంతా ధన రూపంలో, కీర్తి రూపంలో డ్రా చేసుకుంటున్నారు. పూర్వజ న్మలో తెలిసీ తెలియక చేసిన పాపకర్మలతో పాటు ఈ జన్మలో అహంకారంతో దైవబలాన్ని అలక్ష్యం చేయడం ఇత్యాది పాపకర్మ ఫలితాలూ 'సైడ్ బై సైడ్' అనుభవించక తప్పదు అలాంటివారికి కూడా!

ఇక పూర్వజన్మలో అత్యంత భోగభాగ్యాలలో మునిగితేలుతూ అహంకారంతో దైవభక్తి లేకుండా, ధనం వుండీ దానధర్మాలు చేయక, పాపాన్ని కూడబెట్టి పూర్వకర్మ అనే బ్యాంక్‌లో వేసుకుని పుడతారు – అలాంటివారు ఈ జన్మలో ఆ పాపాన్నంతా దరిద్ర రూపంలో, కష్టాల రూపంలో డ్రా చేసుకుని అనుభవిస్తుంటారు. ఈ జన్మలో దరిద్రం అనుభవిస్తూ, దైవభక్తి కలిగివున్నా పూర్వ ప్రారబ్ధం అనుభవించేతీరాలి. క్రెడిట్ క్రెడిట్టే! డెబిట్ డెబిట్టే!! దేనికదే!!! పూర్వజన్మలో తెలిసీ తెలియక చేసిన కించిత్ పుణ్యం వుంటే, దైవభక్తీ కలిగి వున్నందున ఎప్పుడో ఒకప్పుడు ఏదో విధంగా కాస్త సుఖపడక మానరు. ఈ విషయం కొందరు నమ్మవచ్చు, కొందరు నమ్మకపోవచ్చు. నమ్మినా, నమ్మకున్నా మనుషుల్ని తోలుబొమ్మల్ని చేసి పూర్వ కర్మల పేరుతో తైతక్కలాడించేవి నవగ్రహాలు.

ఉదాహరణకు అన్నీ వుండీ ఈనాడూ సుఖపడ లేని నా జీవితమే ఇందుకు తార్కాణం. నాతోపాటు పనిచేసిన కొందరు సినిమా జీవుల జీవితాల్లో ఏర్పడిన ఎదురుచూడని సంఘటనలూ, విచిత్రమైన మార్పులూ తలుచుకుంటే పూర్వజన్మ సుకృత, దుష్కృతాలను నమ్మకుండా వుండలేమనిపిస్తుంది.

ముప్పైయేడేళ్ళ క్రితం (పందొమ్మిది వందల యాభై ఆరు) ప్రాంతాలలో స్వర్గీయ శ్రీ అణ్ణాదురై

# దీప విస్ఫోటనం



అవతారాలెత్తడం ఆదివిష్ణువుకే కాదు
చీకటికీ బాగా తెలుసు.
పగలంతా ఏ బొరియల్లోనో గుహల్లోనో దాక్కొదది.
రకరకాల చమ్కీ దుస్తుల్లో చౌరస్తాల్లో ఊరేగుతుంటుంది.
జీవిత పత్రాల మీద సంతకాలు పెట్టే
వేళ్ల సందుల్లోంచి
లంచం చీకటి అక్షరాలై రాలుతుంటుంది.
సీట్ల స్వీట్ల పంపిణీలో తన వాటా పెంచుకోవాలని
కులం చీకటి నిరాహారాల డేరాలు వేసుకుంటుంది.
వులిమిన విశ్వాసాల రంగు వెలిసిపోతుందని జడిసి
మసీదు ముసుగులోనో గుడి గొడుగు కిందనో
మతం చీకటి అసురతాండవం చేస్తుంటుంది.
ఉలికిన తెల్లచొక్కాలా వున్న శీలాన్ని చూసి
ఓర్వలేని చీకటి బురదై చిమ్ముతుంది.
ఎక్కడ ఏ చిన్నదీపం వెలిగించినా
చీకటివీపు చుర్రుమనే రోజులు పోయాయి.
అది ఈమధ్య అస్తమానం ఆపాదమస్తకం
లోహ కవచంతోనే తిరుగుతుంటుంది.
ఏడాదికోసారి మట్టిదివ్వెలను ముట్టించుకునే
ముంగిళ్ళమీద ఓ కుళ్ళు నవ్వు విసిరిపోతుంటుంది.
కిక్కిరిసిన జనమున్న మహాసభంటే ఒళ్లుమండి
చెప్పల్లో దూరి స్టేజిపైకి ఎగిరి దూకుతుంది.
పబ్లిగ్గా చీకటి ప్రదర్శించే సీరియల్ చిత్రాలే
స్వాతంత్ర్యయోధుల పేరిటి కేటు సర్టిఫికెట్లు
జలదానం చేసే ప్రాజెక్టులకు పలికే గోల్‌మాల్ టెండర్లు.
పందిని నందిగా భజించే పత్రికా ప్రకటనలు
పదవుల బేరాలు కుదరని రాజీనామాల మేజువాణీలు
చేష్టలు కొత్తవిగానీ చీకటి ఉనికి పాతదే
వెలుగుతో పాటు పుట్టిన చీకటి
జీవితాన్ని అంటుకుతిరిగే మృత్యువులాంటిది
ఉన్న చిక్కల్లా వెలుగు మాస్కు వేసుకుని
తారు చీకటి వెండితెర వేల్పులా చెలామణీ కావడం.
నేటి చీకటి భూతం దివ్వెలు వెలిగిస్తే పారిపోదు
ఒక్కొక్క దీపజ్యోతిని ఐస్‌ఫ్రూట్‌లా చప్పరిస్తూ
రక్కసిరుచులు జుర్రుకుంటుంది
కాంతి ఇవ్వడానికి కరెంటు బల్బులున్నాయి
ఇప్పుడు ముట్టిస్తున్న ఓ మట్టి దీపాల్లారా!
ఒక్కుమ్మడిగా పేలిపోండి తూటాల్లా
అప్పుడైనా తాత్కాలిక విముక్తి
అవతారాలు మరిగిన ఈ దగా చీకటి నుంచి

—డాక్టర్ సి.నారాయణరెడ్డి

గారూ, శ్రీ కరుణానిధిగారూ తీసిన 'రంగూన్ రాధ' అనే పిక్చరు మా భరణీ స్టూడియోలోనే షూట్ చేశారు. అణ్ణాదురైగారు కథ వ్రాసి, కరుణానిధి గారు డైలాగ్స్ వ్రాసి, నేనూ, శివాజీగారు యాక్ట్ చేసిన ఆ చిత్రం షూటింగ్ సమయాల్లో తరచూ అణ్ణాదురైగారూ, కరుణానిధిగారూ సెట్స్‌కి వచ్చేవారు షూటింగ్ చూట్టానికి! ఆ పిక్చర్‌లో నేను అద్భుతంగా యాక్ట్ చేశానని నన్ను అభినందిస్తూ అణ్ణాదురైగారు నాకు 'నడిప్పిర్ కు ఇలక్కమ్' – 'గ్రామ పార్ యాక్టింగ్' అనే టైటిల్ పెద్ద ఫంక్షన్‌లో ఇచ్చి గౌరవించారు. శ్రీ అణ్ణాదురైగారు మహాత్మాగాంధీజీ ఆశయాలను ఆచరణకు తేవాలని దీక్షతో కృషిచేసిన గొప్ప వ్యక్తిగా తమిళనాడు ప్రజలు ఆయనను 'తేన్నాట్టు గాంధీ' (దక్షిణ దేశపు గాంధి) అని అంటూరు. అంతకు ముందు ఏడెనిమిదేళ్ళ క్రితమే అణ్ణాదురైగారు వ్రాసి, ఎన్.ఎస్. క్రిష్ణన్‌గారు తీసిన 'నల్లతంబి' అనే పిక్చర్‌లో నేను యాక్టు చేశాను. అప్పట్లో ఒక సినిమా రైటర్‌గానే ఆయన పేరు విన్నాను. అలాగే ఎం.జి. రామచంద్రన్‌గారు 'మలైకణ్ణన్' పిక్చర్‌లో నాతో యాక్ట్ చేసేటప్పుడు ఆయనను ఒక హీరోగానే చూశాం. అతను కాబోయే చీఫ్ మినిస్టర్ అని నేనేకాదు – ఎం.జి. రామచంద్రన్‌గారు కూడా అనుకొని వుండరు. కానీ ఎం.జి.ఆర్. గారు డి.ఎం.కె. పార్టీ ప్రచారానికి అణ్ణాదురైగారికి, కరుణానిధిగారికి కుడి భుజంగా పనిచేసి తను యాక్ట్ చేసే పిక్చర్ల ద్వారా బహుళ ప్రచారం చేశాడనేది ఎవరూ కాదనలేని నగ్న సత్యం. ఆ పార్టీ రావడానికి ముఖ్య కారకుడు ఎం.జి.ఆర్.గారంటే అతిశయోక్తి లేదేమో. ఎం.జి.ఆర్. డి.ఎం.కె. పార్టీకి తోడ్పడుతూ హీరోగా చిత్రాలలో తన 'ఇమేజ్' పెంచుకున్నాడు. అయితే చీఫ్ మినిస్టర్ కావడానికి ఆయనకు ఎనిమిదేళ్ళు పట్టింది. దేనికైనా టైము రావాలంటారు – ఇదే. దానిని పూర్వపుణ్యం అనవచ్చు. ఇలాంటి వారి విషయంలో పెద్దలు 'అఖండ రాజయోగ జాతకులు' అంటుంటారు.

అలాగే మరికొందరి జీవితాల్లో వచ్చిన అకస్మాత్ మలుపులు తలుచుకున్నప్పుడు మానవ ప్రయత్నం కేవలం నామమాత్రమే, అంతా 'ప్లానెట్స్' చేసే 'జగ్లరీ' అనిపిస్తుంది – మా భరణీలో నేను తీసిన 'చండీ రాణి', వాహినీ వారి 'మల్లీశ్వరి' షూటింగ్స్ గుర్తుకువస్తే! ఆనాడు ఎన్.టి. రామారావుగారు తను రాజకీయాలలోకి వస్తాడని అనుకుని వుండడు గదా! ఆయనకు ఆనాడు రాజకీయాలను గురించి తెలుసుకునే వ్యవధి, ఇంట్రస్టూ వున్నట్టు నేను అనుకోను. ఎంతసేపూ తను యాక్ట్ చేసే పిక్చర్ల కాల్‌షీట్స్ ఎడ్జస్ట్‌మెంట్లూ, తన క్యారెక్టరూ, డైలాగ్స్, టైమ్స్, డ్రెస్సూ... ఈ విషయాలకే ఆయనకు సమయము చాలేది కాదేమో.

తన పనేమిటో తనేమిటో అన్నట్లు రాత్రింబవళ్ళు విశ్రాంతి లేకుండా షూటింగ్స్‌లో పాల్గొనే రామారావుగారు షూటింగ్ టైమ్‌లో ఎప్పుడైనా కాస్త సమయం దొరికితే కూర్చున్న చోటే ఓ కునుకు తీసేవారు చిన్నబిడ్డలా. అలాంటి రామారావుగార్ని ప్లానెట్స్ రాజకీయాలలోకి నెట్టాయంటే అవి చేసే మిశ్చిప్‌నీ, పూర్వకర్మఫలాలనీ తల్చుకుని నవ్వుకోకుండా ఎలా వుండను! అలా ప్రతివార్తూ రాలేరే! అలా రావాలని ప్రయత్నించేవాళ్ళు రాలేకపోతున్నారు. పాలిటిక్స్‌లోకి రావడానికి అన్ని అర్హతలూ, హంగులూ వుండీ రాలేకపోతున్నారంటే అదీ 'ప్లానెట్స్' చేసే మిశ్చిపే!

మనుషుల్ని పాచికల్లా పూర్వకర్మానుసారం ఆడించే గ్రహాలు 'గ్రీన్‌సిగ్నల్' ఇవ్వందే ఎవరు ఎంత ప్రయత్నించినా ఏదీ జరగదు. ఈ విషయం ప్రతివారూ వారి వారి అనుభవంలో తెలుసుకోవలసిందే తప్ప ఒకరు చెబితే తెలుసుకునేది కాదు. "ప్రారబ్ధం శిలాతలం" అన్నారు పెద్దలు. పూర్వ ప్రారబ్ధాన్ని ప్రతి జీవీ అనుభవించే తీరాలి. దైవభక్తితో, పుణ్యాకార్యాలతో, పరోపకార చింతతో పూర్వ పాపకర్మలని తగ్గించుకోవచ్చు, ఎక్కువ బాధపడకుండా సులభంగా అనుభవించే శక్తి పొందవచ్చు.

మత్తుమందు ఇవ్వకుండా ఆపరేషన్ చేస్తే మనిషి తట్టుకోలేదు. ఆ మత్తుమందుల బాధల్లో, కష్టాల్లో నొప్పిలేకుండా చేసేది దైవభక్తి. అదే పూర్వ పాపకర్మల బాధావిముక్తి.

*